# పాలెంలో బొమ్మలాట

ఎంకటసుబ్బయ్యగోరి బుడ్డజీతగాడు సూరాయి నెత్తిన కండవా ఏసుకుని ముక్కు ఎగదోసుకుంటా లోన ఏందేందో గొనుక్కుంటా సత్రంకాడ రావి సెట్టువెగ్గిర కొచ్చేతలికి అడ తోలుబొమ్మలాట పందిరి అప్పుడే లెగిసి కూకుందది. పందిరి అట్ట సూసీసూడకతలికే సీలకుండ పగిలి సీలుకార్నట్టు సూరాయి పానం అటనే దిగజారిపోయింది

అసలు సూరాయి యిసువంటి బొమ్మలాటలు సూసే పద్దతే వేరు. బొమ్మలాట ఆడేనాటికి పద్దినాల ముంగల బలానిదినం, బలాని సోట, బలాని మటావోరు బలాని తోల్బొమ్మలాట ఆడ్తారని వూరికి ముంగల సూరాయి పెతోరికీ సెప్పాల. ఆ మరునా మటావోరు వూళ్ళో కొచ్చి దిగినాక ఆ రండర్తో పరాసి కాలాడ్తా, దెగ్గిరదెగ్గిర తిరిగి పందిరి ఏసేయాలా, బొమ్మలాట మొదలుబెట్టే ముంగలా కుర్రసంచును పందిరి సాయలకు రానీకుండా ఓ కోపు కాత్తా, మద్దెమద్దె మటావోర్కి వుసారెక్కిత్తా వుండాల. అసువంటి పద్దతి యిప్పుడు పెడదిరిగింది.

ఎప్పుడో పద్దినాలకి ముంగలే తెల్పింది సూరాయికి నాంచారిమటా వొచ్చి పాలెంలో సత్రంకాడ రావిసెట్టు కాడ బొమ్మలాట ఆడబోతుండారని. ఈ సమాశారం అట్ట తెల్సిందో లేదో ఎంటనే సూరాయి గెహించాడు. అయ్యా తనని ఎంకటసుబ్బయ్యగోరింటో జీతానికి కుదురుస్తా ఆరి గొడ్డసాయిట్టో గొడ్డతోబాటు కట్టేసిపొయ్యాడని.

కన్నీకటి పడే యాలకి పుగాకుపాయలు సీల్చుకుంటా ఎంకటసుబ్బయ్యగోరు పాలెంలో బొమ్మలాట యవారాలేందో యిశారిద్దామని బయెల్లి అట్ట మలుపు తిరిగాడో లేదో సూరాయి గొడ్డసాయిట్లోంచి సల్లగా జారి సత్రంకాడి కొచ్చి నిలబడ్డాడు

తెల్లారి నాంచారి మటా సెరువుగట్టుమీన కుండా పాలెంలోకి రాటం గొడ్డసాయిడి గోడెక్కి ఎప్పుడో సూశాడు సూరాయి. ఇంకా సేపటికి నాంచారి మటా బాపనయ్య బజార్లోకొచ్చి వొత్తావుంటే ఎంకెడ్డే కొండాయ్, కోటాయ్, కాంతాయ్, రంగాయ్, రత్తాయ్ల్తోబాటు జడెగెర్కుంటా సీతాయి రావటం సూసిన సూరాయి సాయిడిసూరుకు అటనే కరుసుకుబోయ్యాడు.

నాంచారి మటా పాలెంలోకి జేర్నట్టు తెలిసి మోత లెగిసి పోతావుంటే,

యీడ గొడ్డసాయిట్లో సందేలదాకా నెవరేత్తాకూకుంద సూరాయి ఎంకటసుబ్బయ్య గోరు అట్ట ఎల్లి సందు తిరగనే తిరిగేతలికి కూతకూసి ఎలకాడకొచ్చిపడ్డట్టు సత్రం కాడి కొచ్చిపడ్డాడు.

అయితే ఏం- పందిరి అప్పుడే లెగిసి కూకుందది. తన సెయి తగలందే ఆ పందిరి లెగిసి కూకుందది! మంచనించి దారి దప్పిన దూడకిమల్లే పందిరి సుట్టూతా సూత్తుంద సూరాయికి పందిరికి కాత్తె పెడగా కోపుగాసిన పోలీసులకి మల్లే కొండాయ్, కోటాయ్, కాంతాయ్, రంగాయ్, రత్తాయిలు సోల్పున నిలబడుంటం పయినంగా అగుపించింది. ఒక్కపాలి యీపుమీన ఋఃదమట్ట పాకినట్టయింది సూరాయికి.

అయ్య తనని ఎంకటసుబ్బయ్యగోరి గొడ్డసాయిట్లో కట్టెయ్యకనేపోతే తనకన్న ముంగలగా కొండాయి ముటా ఆవజాన ఆడ నిలబడుండేదేనా?

"ఆర్నీ సూరాయ్!" అని అరిశాడు కొండాయి.

"ఆర్నీ సూరాయ్!" అనరిశారు కోటాయి, కాంతాయ్, రంగాయ్, రత్తాయిలు.

"ఆళ్ళదే యీడ పెత్తనం. తనని పదామడ ఎనిక్కి నెట్టారాళ్ళు" అనుకుండాడు సూరాయి.

"ఓరి రార్రార సూరాయోవ్!" అనరిశారు కొండాయి ముటా.

"ఆళ్ళమ్యోళ్ళు ఆళ్ళని యాడికి బోతానంటే అడికి పోనిత్తారు. ఆళ్ళ మ్యోళ్ళు మంచోళ్ళు" అనుకుండాడు సూరాయి.

"ఇంటి కెల్లి యిప్పుడే వొత్తాలేరా!" అంటా సూరాయి అట్ట ముంగలికి ఒక్క అడుగు ఏశాడో లేదో లంబాడి కొట్టుపక్కనించి కడ్డికిమల్లే వొత్తుంద ఎంకటసుబ్బయ్యగోరు అట్ట అగుపించేతలికి, యిగ అట్టనే ఎనిక్కి తిరిగి లగెత్తిన లగెత్తడం రత్తమ్మ సందుమలుపుకాడి కొచ్చిపడ్డాడు సూరాయ్.

"ఒరేయ్!" అంది మలుపు మొత్తనుంద ఆ యిగ్రహం.

"అమ్మ సత్తిన్నో రయ్యో"- అంటా అటనే ఆ యిగ్రహమ్మీనకు వొరిగాడు సూరాయ్ సీకట్లో ఏది ఏదయిందీ తెలవక.

"అమ్మ సంపావురా సూరాయో" అందా యిగ్రహం సూరాయిని గెట్టిగా వాటేసుకుంటా.

"ఎవరూ?" అన్నాడు సూరాయి యిగ్రహం జడ సేతికి తగిలేతలికి కాత్తె తెప్పరిల్లుకుంటా.

"సీతాయ్రినా నేనూ, సంపితివిగదంట్రా సూరాయ్."

"సీతాయ్ ? నువ్వేనంటే ?"

"నేనేరా సూరాయ్."

"అసి నువ్వేనంటే విజంగా ? అడలుకు సత్తినిగదంటే దెయ్యం పీకనే పీకిందసి–"

"ఛీ సచ్చినోడా అరవమాక "

"అరవన్లేయే సీతాయ్, ఇదిగో, ఏందే నువ్వీడ సేత్తుందదీ ?"

"నువు అట్నుంచి లగెత్తుకురాటం సూసి యీడ యిట్ట నిలబడ్డానూ, ఆమైన నువొచ్చి మాట యినిపిచ్చుకోకుండానే మీదబడ్డివి !"

"సంపావుగద ఛే !"

"సాల్లే వూర్కో–ఇంకా మీనబడీ సూడయ్యో పాపం !"

"తెలవలేదులేవే సీతాం– దెబ్బ తగిలిందంటే ! పానీలే, మరి యెందుకే మూలనుంచుండావూ ?"

"నీ కోసమేరా'

"నా కోసమంటే ?"

"అవు నా"

"ఎందుకే నా కోసం ?"

"ఒరే సూరాయోవ్, నే బొమ్మలాట కెల్తుండాగా ?" అంది సీతాయ్.

"యేందీ ?" అన్నాడు సూరాయ్.

"నే నాంచారయ్య బొమ్మలాట కెల్తుండాగా ! మా జేజి నన్ను తీసికెల్తా నంది" అంది సీతాయ్.

"నిజంగానంటే ?"

"నిజంగానేరా, కావాలంటే మా జేజి నెల్లి అడుగు తెల్సుద్ది."

"మీ అయ్య ఎల్లమన్నాడంటే ?"

"అయ్యా, మా అమ్మ అంతా ఎల్లమన్నారు నన్ను."

"పానీలేవే సీతాం, నీకేం నువు ఎట్టనన్నా ఎల్తావు."

"అదేందిరా సూరాయ్ ? మరి నువుగూడా రాటం లేదంట్రా ?"

"మా అయ్య నన్ను పోనీయడు."

"ఎందుకని పోనియ్యడ్రా మీ అయ్య నిన్ను ?"

"ఎంకటసుబ్బయ్యగోరి గొడ్డసాయిడి యిడిసి రాకద్దంటాడు."

"అదేందిరా ? బొమ్మలాటన్నా సూడనీయడంట్రా మీ అయ్య ?"

"నీకు తెలవదులేయే మా అయ్య సంగతి."

"మొదులు నీ వడిగావంటా మీ అయ్యనూ ?"

"నే నడక్కేం ! ఎందుకనమ్మా, నాలుగు తన్నించుకోనా !"

"వుత్తినే తంతాడంట్రా మీ అయ్య ?"

"వుత్తినే ఏం తంతాడో తెలవదుగాని- ఎట్టానబ్బా ?"

"ఎట్టనేందిరా ఎల్లి అడక్కా, మొదులు అడక్కుండానే ఎట్టానంటాదేం ? ఒరేయ్, అంతమంది బొమ్మలాట సూత్తారు, నువు సూత్తే మీ అయ్య తప్పంటా డంట్రా ?"

"అనదనుకో, మరి యీ ఎంకటసుబ్బయ్యగోరి గొడ్డసాయిడి సంగతే మంటా ?"

"అప్పుమటుకు రారంట్రా బొమ్మలాట సూడనూ ?"

"ఎందుకు రారూ ! అళ్ళొచ్చే నన్ను గొడ్డసాయిట్టో పండుకోమంటారు."

"ఏందిరా అనేదీ, అరి గొడ్డసంగతి అరికన్న నీ కెక్కువెట్టా ?"

"బలేదానివే, యింకా నయం ! అయితే నాకు డబ్బిచ్చి జీతానికి పెట్టు కుండది పని ఎగ్గొట్టమనెట్టా ?"

"ఎవు రన్నారూ, రేత్తిరి గొడ్డు నిదరబోతుంటే నువ్వాడ దేనికంటారు గానీ ? ఒరేయ్ బొమ్మలాటన్నా సూడకబోతే యింగ నువేం మడ్సివిరా ?"

"అదే సూత్తుండా. పేసీ వొత్తే ఎట్ట నబ్బా-!"

"ఎహె ఏం పేసీ రాదులే. ఒక్కపూట- అందుట్టో యిట్టాటి సమయంలో ఎల్లి అడగరా మీ అయ్యనీ ! మీ అయ్య మంచోళ్ళేరా నాకు తెల్సు."

"ఏం మంచో నాకు తెలవటంలా-"

"సక్కగా మా జేజి వాళ్ళో పొండుకుని, తెల్లార్లూ బొమ్మలాట సూత్తా" అంటున్నది సీతాయి.

"ఆఁ సూశావులే" అన్నాడు సూరాయి.

"రావణాయుద్ధం సెబతాడంట నాంచారయ్య ! అబ్బ ! నుప్పు ల్లెగాల్సిందే నంట ! నాంచారయ్య అల్లుడు కేతిగాణ్ణి పత్తే కడుపుబ్బిపోవాల్సిందేనంట ! నాంచారయ్య పెల్లాం బంగారక్క పాటలు బహాయిసురుగా పాడుద్దంట ! సెన్నా పట్టిందాకా మోత బుట్టిందంట నాంచారయ్య బొమ్మలాటంటే-" అనుకుంటున్నది సీతాయ్.

"ఇదిగో సీతాయోవ్-" అన్నాడు సూరాయ్ కాకబుట్టి.

"ఓరి పోరా, నీకన్న ఆ కొండాయోళ్ళే నయం" అంది సీతాయి.

"ఇదిగో! ఇయాల అరహరబెమ్మదేవులు అడ్డాం ఒచ్చి నిలబడ్డాచరే, యీ నక్కా సూరాయి బలాని సత్రం కాడ, రావిసెట్టు ఇవకాడ, ఏపసెట్టు వాలు కొమ్మమీన కూకుని, నాంచారయ్య బొమ్మలాటగనక సూడకనేబోతే- హా రాభణా!" అంటా గియుక్కున సెక్రం దిరిగినట్టు తిరిగి బయ్యమంటా యింటేపు లగెత్తుకెల్లాడు సూరాయి; సీతాయి అటనే నోరు దెరుసుకు సూత్తుంటే.

అమయిన యియాల బొమ్మలాట యవారం ఐసా పైసా తేలవాల్సిందేనను కుంటా వసిమీన ఇంటికాడిదాకా వచ్చిన సూరాయి యింటిముంగల అరుక్కాడ అటనే జారిపొయ్యాడు, అంతరిచ్చాన దారంతెగిన గాలిపటానికిమల్లే.

ఇంటో అయ్య వుండాడు. అమ్మ, అయ్యా ఏందో జోంమీన మాట్టా త్తుండారు. ఇగ అటనే అరుగుమొత్తకాడ సీకట్లో నక్కాడు సూరాయి.

"ఏందయ్యోవ్ పెట్టిలోంచి ఎర్రకండవా తీత్తుండావ్?" అంటు దది అమ్మ.

"తీత్తే తీశార్లేం నువాడ కూకో. పెతిదీ నీకు కావాల్సిందే నెట్టా?" అంటుండాడయ్య.

"పెతిదీ ఎవుర్గ్గావాలా? రేత్తిరిపూట పెట్టిలోవుండ ఎర్రకండవాతో ఏం పనొచ్చిందా అ నడిగా, తప్పెట్టా?" అంది అమ్మ.

"ఎవు డన్నాడు తప్పనీ. దురగమ్మకుమల్లే ఆ డేదో మూలకూకుండా వనుకుంటే అప్పుడే తగుల్కొంటివి. వూరకనే పెట్టిలో వుంటే ఏసుకుంటుండా. కొనుక్కు తెచ్చుకుండది ఏసుకుంటానికి కాదెట్టా?" అన్నాడు అయ్య.

"ఏసుకుంటే ఎవురి కేం బట్టిందీ. ఇన్నాలనించి పెట్టిలో వూరకనే వుండ దిగా. ఈ రేత్తిరేం పనొచ్చిందీ?" అంది అమ్మ.

"బువదిన్నాక ఎంకయ్య ఓపాలి రామంటే ఎల్తుండాలే- సానా పనుందది- నువ్వారికే బురదమట్ట ఎగిరిన టైగరమాక" అన్నాడు అయ్య.

"బురదమట్ట గిరదమట్ట అనమాక. అయితే ఎంకయ్య ఎర్రకండవా ఏసు కునిగాని రావద్దన్నా డెట్టా?" అంది అమ్మ.

"ఏహె రమ్మన్లేదులే, రేకర్కంప తగుల్కుండట్టు తగుల్కుండావు. పెట్టిలో సెదపురుగేమన్నా సేరిందేమోనని సూసి, పానీగందా అని పూరకనే కండవా ఏసుకుంటే రాగం మొదులుబెట్టావే యిడవకుండా?" అన్నాడు అయ్య.

"అహఁ, అట్టనా! అయితే కూసేపుండు. నా ఆకుపచ్చ కోకగూడ సెద లేమన్నా పట్టినయ్యేమో సూడనీ-"

"సెదలేం పట్టలేదుగానీ ఇపుడు నీకోకలు గీకలేం తియ్యమాక-అహఁ- అదేఁదీ పచ్చకోక కట్టుకుంటుండదీ?" అంటున్నాడు అయ్య.

"వూరకనే కట్టుకుంటుండాలే. కోకలు కొనుక్కుందది కట్టుకుంటానిక్కాదెట్టా? వుండట్టా-" అంటున్నది అమ్మ.

"ఇదిగో - అదేందీ తలగూడ దువ్వద్దే - ఇదిగో ఏందమ్మోవ్ నీ యవారం!" అంటున్నాడు అయ్య.

"యవారమా? సెబతాలే పద-"

"ఇదేంది- యాడకి అటుబోతావు. తలుపుకాడికే?" అంటుండాడు అయ్య.

"ఎంకయ్యకాడ నాకూ పనుంది. ఎల్దాం పదా" అంది అమ్మ.

"ఎంకయ్యా! ఎంకయ్య ఎవురూ? అయితే ఎంకయ్యని అట్టుంచు. ఇడిగో నమ్మోవ్! నువు బొమ్మలాట గిమ్మలాటకని పచ్చకోకగట్టి బయలెల్తుండావుగావాఁల మరదేందో-" అన్నాడు అయ్య.

"ఎఁకయ్య ఎవురంటంకాడికొచ్చిందీ? అయితే ఎర్రకండవా ఏసింది బొమ్మలాటకాడికా అయ్యా? హుఁ అంత దొంగసాటుగా ఎలాల్సొచ్చిందా అయ్యా! నాకు తెలవదనుకుండా నీ ఏసిగాలూ- వుండు తెల్లార్లెగుస్తే మావూరు మాఅమ్మ అయ్యకాడ కెల్లకబోతే సూడు. ఎల్లకబోతే నాపేరు దురగమ్మ కాదనాల్సిందే. ఎంతన్నాయం! ఎంతమాయా! అన్నీ దొంగమాటలే, అంతా బూటకమే! మామ్మా, మా అయ్యేగనక వుంటే ఈ మడిసి ఇట్టా జేత్తాడూ- హుఁహూఁ- అమ్మాఁ!".

"దురగమ్మ తల్లీ యాడవమాకే నీకు దణ్ణంపెడతా, బుద్ది గెడ్డితింది లేవే-"

"వుండూ- నన్నంటుకోమాకా- అమ్మా-"

"పెద్దగా అరవమాకే తల్లా- యీసూరాయన్నా వొత్తే బాగుండు. యదవ రాడేం ఏ యాలకూ- బొమ్మలాట కెల్దాం యిగవూరుకోవే-"

"ఏం అక్కర్లా. నువే ఎల్లు ఎర్రకండవాతో. సూరాయి, నేనూ ఎటుబోతే నీకేం?"

"అహఁ, అదుగందుకే- ఎదవ పనే జేశా- యాడో గెజ్జెల సప్పు డవు

తుందే– యీ సూరాయివొ తే బాగుండు. దొబ్బున బొమ్మలాట కెల్లొచ్చు–పాటలు యినొస్తుందయి మొదలుబెట్టలేదుగందా- ఎపురాడా-సూరాయ్ ? ఏందిరా తలకాయి లోనికిజెట్టి అట్ట సూత్తుండావు- చా యదవా-దబ్బున రామంటుంటే – ఎంకట్టు బ్బయ్యగారితో సెప్పొచ్చావంటా ?"

"మరే- ఆరు అటెల్తిసీ-" అన్నాడు సూరాయి లోనకొచ్చి అటనే గోడ కానుకుని యీపు రుద్దుకుంటా.

"చాయదవా–" అంటున్నాడు అయ్య.

"ఆడిమీకికి లెగవమూక వుత్తపున్నానికి – యా కుందడిరా నీ గళ్ళ సౌక్కాయా– ఎల్లి ఏసుకోవేందిరా ?" అంది అమ్మ కళ్ళు ఆడిస్తా.

"ఆ పెట్టిలోవుంది ఏసుకోవేరా దొబ్బునా ? అన్నాడు అయ్య.

ఆమయిన బయల్దేర్తం బయల్దేర్తం దార్లో అమ్మా అయ్యల్ని సందుసూసు కుని సల్లగాదాటేసి, బొమ్మలాట పందిరికి అసంట ఆల్ల జేజికాడ కూకుని అటీటు నిక్కినిక్కి జూత్తుండ సీతాయి జడతోక ఎనకమాలే ఎల్లి గబిక్కిన ఓ గుంజు గుంజి, సెక్కలు, చీనారేకుడబ్బాలు దన్దనామంటా కేతిగాడు, బంగారక్క తెర మీనకు వొచ్చేయాలకి; యాపసెట్టుమీన కూకుంద కొండాయి ముటాను ఎడాపెడా తోసుకుంటా ఎల్లి సెట్టు మయాన వాలుకొమ్మమీన కూకుండాడు సూరాయి.

★